రైతు బజార్ ఎండమావేనా..?

- వినియోగదారుల ఇబ్బందులు
- అధిక ధరలకు కూరగాయల విక్రయాలు
- నిరుపయోగంగా గతంలో నిర్మించిన షెడ్లు
- నిర్మాణా నికి రూ.40 లక్షల మంజూరు

నిడదవోలు: నియోజకవర్గ కేంద్రం నిడదవోలు పట్టణంలో రైతుబజారు లేకపోవడంతో వినియోగదారులు అధిక ధరలకు కూయగాయలు కొని తీవ్రంగా నష్టపోతున్నారు. 'రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తాం..దళారీ వ్యవస్థ లేకుండా చూస్తాం నేరుగా రైతుల నుంచి వారు పండించిన ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసి అండగా నిలుస్తాం' ఇది కూటమి ప్రభుత్వంలో పాలక పెద్దలు, అధికారులు చెబుతున్న మాటలు. వీటికి క్షేత్రస్థాయిలో పరిస్థితికి పూర్తిగా విరుద్ధంగా ఉంది. నిత్యవసరాలు, కూయగూరల ధరలు ఆకాశానంటుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు సతమతమవుతున్నారు.

ఇది పరిస్థితి..

పట్టణంలో రైతు బజార్ ఉంటే అక్కడే సరసమైన ధరలకు కూరగాయలు, పండ్లు కొనుగోలు చేయవచ్చునని ప్రజలు దశబ్దకాలంగా ఎదురుచూస్తున్నారు. కానీ రైతు బజార్ ఏర్పాటు మాత్రం ఎండమావి గానే మిగిలిపోయింది. గోదావరి పరిసర ప్రాంత రైతులు పండించిన పంటలను రైతులే స్వయంగా అమ్ముకునేలా వినియోగదారులకు సరసమైన ధరలకు నాణ్యమైన కూరగాయలు పండ్లు అందించేందుకు రైతు బజార్లు దోహదం చేస్తాయి.

200 మంది సాగుపై ఆధారం

నిడదవోలు మండలంలో గోదావరి తీర గ్రామాలైన విజ్జేశ్వరం, పందలపర్రు, పెండ్యాల, గోపవరం, తాడిమళ్ల, రావిమెట్ల, కంసాలిపాలెం గ్రామాల్లో సుమారు 200 మంది రైతులు ప్రతీఏటా బెండ, బీర, వంకాయలు, ఆనపకాయలు, చిక్కుడి, టమోటా, క్యాబేజీ, దొండ పంటలను పండిస్తున్నారు. ఉదాహరణకు 10 కేజీల బెండకాయలు రైతు నుంచి కేవలం రూ.300 రూపాయలకు దళారులు కొంటారు. కమిషన్ రూ.30 తీసుకుని రైతుకు రూ. 270 మాత్రమే ఇస్తారు. మళ్లీ వ్యాపారులకు రూ.300 విక్రయిస్తారు. దుకాణాల వ్యాపారి మాత్రం డిమాండ్‌ను బట్టి కేజీ బెండ రూ.40 నుంచి రూ.60 వరకు వినియోగదారులకు విక్రయించి లాభపడుతున్నారు. రైతు పండించిన పంట సరాసరి రైతు బజార్‌కు తీసుకువచ్చి విక్రయాలు చేస్తే లాభాలు చేకూరుతాయని రైతులు చెబుతున్నారు.

నిరుపయోగంగా మినీ రైతుబజార్

2017లో మార్కెట్ కమిటీ నిధులు రూ.4లక్షలతో పట్టణంలోని సంతమార్కెట్‌లో మినీ రైతుబజార్ నిర్వహణ కోసం షెడ్డు నిర్మించారు. రైతుబజార్ ఏర్పాటు చేశారే కానీ వ్యాపారానికి అవసరమైన కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో రైతులు ఇక్కడ రావడానికి ఆశక్తి చూపలేదు. దీంతో దళారులు ప్రమేయం లేకుండా రైతులు తమ పంటలు నేరుగా తెచ్చుకుని అమ్ముకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన రేకుల షెడ్డు నిరుపయోగంగా మారింది. కొందరు వ్యాపారులు షెడ్డులో వారికి సంబంధించిన కూయగూరలు ట్రేలు, ఇతర సామాన్లను భద్రపరచుకుంటున్నారు.

సిండికేట్‌గా ఏర్పడి

గతంలో నిడదవోలు మండలంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పెండ్యాల, గోపవరం గ్రామాలకు చెందిన రైతులతో కూరగాయల ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లతో పాటు రైతులు, మార్కెట్ కమిటీ సభ్యులు కమిటీలో ఉంటారు. సంఘంలో 17 మంది రైతులకు రైతు బజారులో తమ పంటలను విక్రయించడానికి వెసులుబాటు కల్పించారు. అయితే పట్టణంలో ఉన్న సుమారు 20 వరకు బడా వ్యాపారస్తులు సిండికేట్‌గా ఏర్పాటై వారి సొంతలాభాల కోసం వ్యాపారాలు చేయకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్ కమిటీ, ఉద్యాన శాఖ, వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించలేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.



సంతమార్కెట్లో రేకుల షెడ్డుతో నిర్మించిన మినీ రైతు బజార్



గోపవరంలో క్యాబేజీ పంటను కోస్తున్న సన్నకారు రైతు

ఇవి నిబంధనలు..

నిబంధనల ప్రకారం రైతు నుంచి 4 శాతం కమిషన్‌తోనే సరుకుని కొనాలి. అయితే దళారులు ఇష్టం వచ్చినట్లు రైతుల నుంచి అతి తక్కువ ధరకు సరుకు కొనుగోలు చేసి హోల్‌సేట్ మార్కెట్లో ఎక్కువ కమిషన్‌కు విక్రయిస్తున్నారు. రైతు బజార్‌పై రైతులకు అవగాహన కల్పించి, దళారుల బారి నుంచి, ప్రధానంగా కాయగూరలను పండించే సన్నకారు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి పెద్ద రైతులు ముందుకు రాకపోయినా చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించి కనీసం నిరుపయోగంగా ఉన్న షెడ్డులో దుకాణాలు ఏర్పాటు చేస్తే తక్కువ ధరకు కూరగాయలు సామాన్యులకు లభించే అవకాశం ఉంటుంది.

తక్కువ ధరలకే కూరగాయలు



పట్టణంలో రైతుబజార్ లేక అధిక ధరలకు కూరగాయలు కొంటున్నాం. బయట మార్కెట్ కంటే రైతు బజార్‌లో కావాల్సిన సరకులు తక్కువ ధరకు లభిస్తాయి. ప్రస్తుతం పెరిగిన కూరగాయల ధరలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నిత్యవసరాలు కూడా కొనలేక సతమతవుతున్నాం. రైతుల బజార్ ఏర్పాటు చేస్తే తక్కుత ధరలకు నాణ్యమైన కూరగాయలు లభిస్తే ఇంటి బడ్జెట్లో కొంత ఖర్చులు తగ్గతాయి.
– మేడిచర్ల కోమలిదేవి, గృహిణి, నిడదవోలు)

రూ.40 లక్షల మంజూరు

పట్టణంలోని సంత మార్కెట్లో రైతు బజారు నిర్మాణానికి మెప్మా నిధులు రూ.40 లక్షల మంజూరయ్యాయి. సుమారు 10 దుకాణాలు ఏర్పాటు చేయడానికి షెడ్డులతో నిర్మాణాలను చేపతాం. టెండర్లు ప్రక్రియ పూర్తవగానే రైతు బజార్ నిర్వహణకు షెడ్డులు నిర్మిస్తాం. రైతు బజార్ ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా తమ పంటలను విక్రయించుకునేందుకు అవకాశం కలుగుతుంది.
– సామవేదం హేమంత్ శ్రీనివాస్, మున్సిపల్ ఏఈఈ

క్లుప్తంగా

ఐదు అర్జీల స్వీకరణ



కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో అర్జీలను స్వీకరిస్తున్న రాణి సుస్మిత

తాళ్లపూడి (కొవ్వూరు): మీ కోసం కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా గ్రీవెన్స్‌కు హాజరయ్యి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్–మీ కోసం వేదికలో పాల్గొని వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ భూ సమస్యలను పరిష్కరించాలని ఐదు అర్జీలు అందాయని పేర్కొన్నారు. వారంలో రెండు రోజులు ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లా అధికారి, డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించి అర్జీలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మీ కోసంలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, వారు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వైభవంగా గుబ్బాలమ్మ ఉత్సవాలు



శాకంబరి అలంకరణలో గుబ్బాలమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ గుబ్బాలమ్మ అమ్మవారి శాకంబరి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గుబ్బాలమ్మను పూలు, పండ్లు, వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారినిరాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ పంచదార దుర్గాప్రసాద్, ఉప సర్పంచ్ ఎ.శ్రీనివాస్, దుర్గాశ్రీను, దొడ్ల మణికంత, ఆలయ మేనేజర్ ఎస్.సూర్యప్రకాశరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

10 న మెగా పీటీఎం

నిడదవోలు రూరల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఈనెల 10న (మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌ను) నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కేవీ గణేష్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించడంతో పాటు విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 పి.గురుమూర్తి, సీఆర్పీలు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ



విద్యార్థినులతో స్వర్ణ లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల అధ్యాపకులు

ఉండ్రాజవరం: తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బూరుగుపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో ఉండ్రాజవరం జెడ్పీ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు సోమవారం ఉచిత యూనిఫాం అందజేశారు. క్లబ్ చైర్ పర్సన్ లయన్ చిట్టూరి సుజాత ఆర్థిక సహకారంతో సుమారు 20 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ చైర్‌పర్సన్ కోడూరి పద్మావతి, మాజీ అధ్యక్షుడు బంటుమిల్లి శేషారావు, లయన్ లలితకుమారి, కళాశాల హెచ్ఎం పి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ



పెద్దేవం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన బాధితులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం సాయిబాబా ఆలయం సమీపంలో సోమవారం రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తాళ్లపూడి పోలీసులు వివరాలు మేరకు తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన మెంటిమి చంద్రశేఖర్ భార్యా, పిల్లలతో కలిసి తాళ్లపూడిలో నిత్యవసరాల కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో, బల్లిపాడుకు చెందిన మద్దిపాటి నాగేశ్వరరావు మోటార్ సైకిల్‌పై వస్తుండుగా ఎదురెదురుగా ఢీకొట్టుకోన్నాయి. క్షతగాత్రులను 108లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. తాళ్లపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

చాగల్లు: ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు గారపాటి విజయదుర్గ శ్రీనివాస్, గోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబురావు అన్నారు. మండలంలో బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డా.నిశిత ఆధ్వర్యంలో సోమవారం ఊనగట్లకు చెందిన మహిళకు మూడవ కాన్పు ఫ్రీ డెలివరీ కావడంతో తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రత్తిపాటి నాగేంద్ర బాలింతరాలుతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సొంత భవనం లేక ఇబ్బందులు

పీహెచ్‌సీ ఏర్పాటుచేసి సుమారు 3 ఏళ్లు అయిన సొంత భవనం, సరైన వసతులు లేక ఇక్కడ ప్రసవాలు చేయటానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం తాత్కాలిక భవనంలోనే దాతల భాగస్వామ్యంతో పీహెచ్‌సీ సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



తల్లీబిడ్డలతో మాట్లాడుతున్న అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు

9న సమ్మెను విజయవంతం చేయండి

నిడదవోలు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జువ్వల రాంబాబు కార్మిక ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులు, కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మిక వర్గంతో పాటు మున్సిపల్ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని నాయకులు పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ సమ్మెలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూరుగోపు చిరంజీవి, సాయి, రమణ, కాకి శేఖర్, బి.కొండ, తదితరులు పాల్గొన్నారు.

- ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్, జిల్లా కమిటీ సభ్యులు తీపర్తి వీర్రాజులు కోరారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సమ్మె కరపత్రాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ సురేష్ కుమార్, వీర్రాజు, పులుగు చైతన్య, మల్లేశ్వర రావు, రాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అవకతవకలపై ఫిర్యాదు

తాళ్లపూడి: మండలంలోని రాగోలపల్లి విశాల సహకార పరపతి సంఘ సభ్యులు, సొసైటీ పరిధిలోని పలువురు రైతులు తమకు ఎటువంటి బకాయిలు లేన్నప్పటికి, తమ పేరుతో ఓవర్ డ్యూ ఉన్నట్లు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తీసుకున్న రుణం కంటే అదనంగా అప్పున్నట్లు సొసైటీ సిబ్బంది చూపుతున్నారని ఖండవల్లి మాణిక్యం, ఈరోతు లక్ష్మి, కాకర్ల మంగాయమ్మ, గద్దె లక్ష్మి తదితరులు సొసైటీ ఖాతాదారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు, కొవ్వూరు ఆర్డీఓకు ఫిర్యాదులు అందచేసినట్లు తెలిపారు. సొసైటీలో జరిగే అవకతవకలపై విచారణ జరపాలని కోరామన్నారు. రాగోలపల్లి సొసైటీ కార్యదర్శి కె.భాస్కరరావు మాట్లాడుతూ ఇటీవల రికార్డులు అన్ని కంప్యూటరీకరణ చేశామని, రైతులు తప్పుడు బకాయిల గురించి ఆందోళన పడవలసిన అవసరం లేదని సూచించారు.



రాగోలపల్లి సొసైటీ కార్యాలయం

పేదల నాయకుడు వంగవీటి రంగా

పెరవలి: పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, జనహృదయ నేత వంగవీటి మోహన్ రంగా అని, రాజకీయంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నాయకుడని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి మండలం కాకరపర్రులో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వంగవీటి రాధాతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంగవీటి రాధా మాట్లాడుతూ తండ్రి ఆశయాలను నెరవేర్చటమే తన ధ్యేయమని, పేదల కోసం ఎప్పుడు తన తలుపులు తెరిచే ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవి, రంగ అభిమానులు, పార్టీలకు అతీతంగా కాపు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కాకరపర్రులో వంగవీటి మోహన రంగా విగ్రహావిష్కరణ చేస్తున్న మంత్రి దుర్గేష్, వంగవీటి రాధా

వైఎస్సార్ విగ్రహాలు ముస్తాబు



చెక్‌పోస్టు సెంటర్ వద్ద విగ్రహానికి రంగులు వేస్తున్న నాయకులు

గోపాలపురం: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని వైఎస్సార్ సీపీ నాయకులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం గోపాలపురం చెక్ పోస్టు, వై జంక్షన్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. రాష్ట్ర మాజీహోం మంత్రి, పార్టీ క్రమశిక్షణాకమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత జయంతిని పురస్కరించుకుని మంగళవారం వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలతో నివాళులర్పించి, అనంతరం ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టుల పంపకం చేస్తారని మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని కరిచర్లగూడెం, జగన్నాధపురం, వాదాలకుంట, చిట్యాల, గోపవరం, కొవ్వూరుపాడు, దొండపూడి, రాజంపాలెం, హుకుంపేట, రాంపాలెం, వెంకటాయపాలెం గ్రామాల్లో ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ



డిపో మేనేజర్ ధనంజయ

నిడదవోలు: నిడదవోలు నూతన ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కె.ధనంజయ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు పదోన్నతిపై కృష్ణ జిల్లా డీపీటీవోగా వెళ్లారు. అన్నమయ్య జిల్లా రాయజోటి ఆర్టీసీ డిపో నుంచి కె.ధనంజయ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. డిపో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, కలసికట్టుగా పనిచేయాలని ఆయన సిబ్బందికి సూచించారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, కోశాధికారి గుంటిపల్లి సత్యసాయితో పాటు కార్యవర్గ సభ్యులతో డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కళ్యాణ చక్రవర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. అనంతరం మంత్రిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, గుంటుపల్లి శ్రీనివాసరావు, మారిశెట్టి అమ్మిరాజు, కొర్లేపర రత్నకుమర్, అనంతపల్లి కృష్ణ చైతన్య, జయవరపు కోటేశ్వరరావు యాసరపు రామకృష్ణ, కారింకి సాయిబాబు, చిక్కాల రాజా తదితరులు పాల్గొన్నారు.

మేము ప్రభుత్వ ఉద్యోగులం కాదు

తాళ్లపూడి: తాము ఐసీడీఎస్‌లో పనిచేస్తున్నాం తప్ప, తమని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలేదని, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలను వర్తింప చేయకపోవడం దారుణమని తాళ్లపూడి, మలకపల్లి సెక్టార్‌ల పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది వాపోయారు. ఈ మేరకు మండల తహసీల్దార్ లక్ష్మి లావణ్యకు సోమవారం వినతి పత్రాన్ని అందచేశారు. వర్కర్లు ఆర్.జ్యోతి, ఇర్లపాటి రమణ, మాట్లాడుతూ తమ కుటుంబాల్లో పిల్లల చదువులు, పింఛన్లు, సంక్షేమ పథాకలు కోసం రేషన్ కార్డులకు దరఖాస్తూ చేసుకోగా ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న కారణంగా ప్రభుత్వ ఉద్యోగుల పరిధిలో ఉన్నామని, సంక్షేమ పథకాలకు అనర్హులుగా గుర్తిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు తమ ఇళ్లల్లో పెళ్లి అయిన పిల్లలకు ప్రత్యేక కార్డులు మంజూరు చేయాలని కొరుతు వినతి పత్రాన్ని అందచేశారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

పెరవలి: రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా ఇసుక తవ్వకాలు మే 31వ తేదీతో నిలిపివేసినా, రాత్రిళ్లు ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరిపి వందలాది లారీలతో ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని పెరవలి మండలం కాకరపర్రు ఇసుక ర్యాంప్ నుంచి సోమవారం తమకు అందిన సమాచారం మేరకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. అనంతరం రెండు లారీలను టాస్క్‌ఫోర్స్ అధికారులు పెరవలి పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని వెల్లడించారు.

విద్యార్థుల డ్రాపౌట్లు తగ్గించాలి

చాగల్లు: మండల కేంద్రం స్థానిక విద్యావనరుల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి 1 కేవివి రామాంజనేయులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఏ ఒక్క విద్యార్థి డ్రాప్ అవుట్ కాకూడదని సూచించారు. ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేయరాదని హెచ్చరించారు. బస్సులు, వ్యానులు ఫిట్నెస్ కలిగి ఉండాలని, డ్రైవర్‌లకు తరచుగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి



తానేటి వనిత, మాజీ హోంమంత్రి

దేవరపల్లి: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం గోపాలపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని మాజీ హోంమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామాల్లోని వైఎస్ విగ్రహాలకు రంగులు వేసి ముస్తాబు చేసి పూలమాలలతో నివాళులర్పించడంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటలకు నల్లజర్ల, 9.30కు గోపాలపురం, అనంతరం 10.30 నిమిషాలకు యర్నగూడెంలోని పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో పాల్గొంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల్లోని పార్టీ అధ్యక్షులు, నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మహిళ ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

తాళ్లపూడి(కొవ్వూరు): ఆటో డ్రైవర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సీఐ విశ్వం హెచ్చరించారు. కొవ్వూరు పట్టణంలోని ఆటో యూనియన్ నాయకులు, సభ్యులతో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. స్కూల్ పిల్లలను తరలించే సమయంలో పాటించవలసిన నియమ నిబంధనలుపై చర్చించారు. పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఆటోకు రికార్డు తప్పనిసరిగా ఉండాలని లేని వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఏఎస్సై శ్రీనివాసరావు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.